## క్లుప్తంగా

### ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



ఫైనల్‌లో గెలుపొందిన ఫ్రెండ్స్ ఎలెవన్ జట్టు

రాయదుర్గంటౌన్: వైఎస్సార్‌సీపీ యువనేత కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న రాయదుర్గం యూత్ స్పోర్ట్స్ లీగ్(ఆర్‌వైఎస్‌ఎల్) సంక్రాంతి క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం పట్టణ స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీ జరిగింది. మొత్తం 29 క్రికెట్ టీమ్‌లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో ప్రిన్స్ ఎలెవన్ జట్టుపై ఫ్రెండ్స్ ఎలెవన్ జట్టు ఘన విజ యం సాధించింది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై ఫైనల్ క్రికెట్ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. ఇక నియోజకవర్గస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ఓబనాగరాజు, బషీర్ తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయా దవ్, వలి బాషా, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్లు డిష్ గోవిందు, ఫక్రుద్దీన్, వన్నూరుస్వామి, వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీ నర్ ముస్తాక్, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

### నేడు రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావిలో మంగళవారం ఆంజనేయస్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మూలవిరాట్‌కు గంగపూజ, అభిషేకం, ధ్వజారోహణం, మహా మంగళారతి తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. బుధవారం పూలపల్లకీ సేవ కార్యక్రమం చేపడతామన్నారు.

### తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న ఎంపీపీ పుష్పావతి

విడపనకల్లు: అనారోగ్యంతో మృతి చెందిన బోయ మల్లికార్జున(47) కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం రూ.10 వేలను ఎంపీపీ కరణం పుష్పావతి, ఎంపీటీసీ ఓబుళేసు, సర్పంచు సుశీల అందజేశారు. మండలంలోని గడేకల్లు గ్రామంలో బోయ మల్లికార్జున సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. వేల్ఫేర్ అసిస్టెంట్ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కలసి మృతుని కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. మిగతా నగదు నామినీ ఖాతాలోకి ప్రభుత్వం జమ చేస్తుందని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు భీంరెడ్డి, నాయకులు హంపయ్య, ప్రసాదు, ఉమాశంకర్ , అడివప్ప, భీమలింగ, రామాంజనేయులు పాల్గొన్నారు.

### పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



స్ప్రేయర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విడపనకల్లు: కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. మండలంలోని గడేకల్లు గ్రామంలో సోమవారం వికసిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచు కురుబ ధనలక్ష్మి, దేవరాజు, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

### ఆలయాలకు పోటెత్తిన భక్తులు



కూడేరు: జోడు లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు/వజ్రకరూరు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం దేవాలయాలు భక్తులతో పోటెత్తాయి. కూడేరులోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం, బసాపురం ఆంజనేయ స్వామి, షిర్డిసాయిబాబా ఆలయం, కరుట్లపల్లి, ముద్దలాపురంలో రామాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే అంతరగంగలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలు, కలగళ్లలోని వెంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అదేవిధంగా వజ్రకరూరులోని నగరేశ్వర స్వామి, భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి, జనార్దన వేంకటేశ్వరస్వామి, షిరిడీసాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### వ్యక్తి మృతి

రాయదుర్గం రూరల్: మండలంలోని బొమ్మక్కపల్లి, ఉడేగోళం గ్రామాల మధ్య గత నెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో బెళుగుప్ప మండలం అంకంపల్లి గ్రామానికి చెందిన ఉగ్రహారం ఓబుళేసు (41) గాయపడిన విషయం విదితమే. అతడు అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ బాలు తెలిపారు.

# అంబరం.. 'నూతన' సంబరం

- ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు
- కిటకిటలాడిన ఆలయాలు, చర్చీలు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువతీ యువకులు, స్నేహితులు, అభిమానులు ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. 2023కు స్వస్తి పలికి 2024 సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. డీజేలు, మైక్‌లు ఏర్పాటు చేసుకుని యువత చిందేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.



రాయదుర్గం: పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దంపతులు



ఉరవకొండ: పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

రాయదుర్గం: నియోజకవర్గం వ్యాప్తంగా 2024 నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, చర్చీలు కిటకిటలాడాయి. సోమవారం ఉదయం మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి పట్టణంలోని స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథిగృహం వద్దకు చేరుకున్నారు. అక్కడ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేశారు. అక్కడే అన్నదానం నిర్వహించారు. అలాగే ఏపీఐఐసీ చైర్మెన్ మెట్టు గోవిందరెడ్డి నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలు సందడిని తలపించాయి. నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి మెట్టుతో పాటు ఆయన తనయుడు విశ్వనాథ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, పొరాళ్ల శివ స్వగృహం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాపు, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లోనూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. నేతలకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఐదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు, మండల కన్వీనర్లు, పట్టణ, ఆయా మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులున్నారు.

కళ్యాణదుర్గం: 2024 నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ఉదయం నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో ఉద్యోగులు, సిబ్బంది ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డాక్టర్ రాణి సుస్మిత, డీఎస్పీ బి.శ్రీనివాసులు, జడ్జి సుభాన్, ట్రాన్స్‌కో ఈఈఈ శేషాద్రి శేఖర్, డీఎల్‌డీఓ శంకర్, ఫైర్ , అటవీ, విద్య, హౌసింగ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎంపీడీఓ, తహసీల్దార్, ఐసీడీఎస్ అధికారులకు సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బ్రహ్మసముద్రం: నూతన సంవత్సవ వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బసవరాజు, రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మైనార్టీ విభాగం నాయకుడు నజీర్ తదితరులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే ఎంపీడీఓ దాసానాయక్, సిబ్బంది నూతన సంవత్సరం సందర్భంగా ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా సోమవారం నూతన సంవత్సరం వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామాల్లోని యువతీ యువకులు స్నేహితులు, అభిమానులు ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాక్షలు చెప్పుకున్నారు . కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఆదివారం రాత్రి 12 సమయంలో వివిధ గ్రామాల్లో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. వివిధ వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

వజ్రకరూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఎంపీపీ రమావత్‌దేవి, ఎంపీడీఓ విజయలలిత తదితరులు కేక్ కట్ చేశారు.ఎంపీపీకి ఎంపీడీఓ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కణేకల్లు: కణేకల్లులో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి యువకులు, విద్యార్థులు బస్టాండ్, రామనగర్ తదితర ప్రాంతాల్లో బాణసంచా పేల్చుతూ కేరింతలు కొడుతూ... కేక్‌లు కట్ చేసి కొత్త సంవత్సరాన్ని స్వాగతించారు. అలాగే సోమవారం ఉదయం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని చిక్కణ్ణేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, షిర్డిసాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రజాక్‌వలికి వీఆర్వోలు, ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులకు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే విశ్వ ఆధ్వర్యంలో..

ఉరవకొండ/వజ్రకరూరు: ఉరవకొండ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నూతన సంవత్సర సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నియోజకవర్గంలోని ఉరవకొండ పట్టణంతో పాటు బెళుగుప్ప, కూడేరు, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు, మహిళలు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు, అభిమానుల మధ్య మాజీ ఎమ్మెల్యే కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఉరవకొండ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్, అర్బన్ సీఐ తిమ్మయ్య, బెళుగుప్ప, కూడేరు, వజ్రకరూరు, విడపనకల్లు, పాల్తూరు ఎస్‌ఐలు, సిబ్బంది తదితరులు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పలు ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన వేడుకలకు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

### చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు

కళ్యాణదుర్గం: పట్టణంలోని పలు చర్చీల్లో సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పట్టణంలోని సీఅండ్‌ఐజీఎం, విక్టరీ, కల్వరి, హోసన్నా, అగాపె తదితర చర్చిలలో ఉదయం నుంచి విశ్వాసులు ప్రార్థనలు చేశారు. రాష్ట్రంలో మంచి వర్షాలు కురవాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని క్రీస్తును ప్రార్థించారు. కార్యక్రమంలో దైవ సేవకులు రెవరెండ్ ఐజయ్య, సువార్తీకులు చల్లాకిశోర్, కమిటీ సభ్యులు చల్లా రాజశేఖర్ చౌదరి, దేవ ప్రసాద్, భాస్కర్, రవికుమార్, ఆర్థర్‌బాబు, రోజ్లీరాజేష్, సునీల్‌కుమార్, జోసెఫ్ కిశోర్ తదిరులు పాల్గొన్నారు.

కంబదూరు: మండలంలో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. స్థానిక సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిలో పాస్టర్ జేమ్స్ బైబిల్ సందేశాన్ని బోధించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు దినకర్, జాన్ శాస్త్రీ, ప్రభుదాసు, పౌల్, విజయ్ కుమార్, జకరయ్య, జాకబ్ పాల్గొన్నారు.



అనంతపురం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం



రాయదుర్గం: నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు



రాయదుర్గం: గౌని ఉపేంద్రారెడ్డి ఇంటివద్ద నూతన సంవత్సర వేడుకల సందడి



కళ్యాణదుర్గం: ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మితకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సిబ్బంది



కంబదూరు: కేక్ కట్ చేస్తున్న పాస్టర్ జేమ్స్, సంఘ పెద్దలు



కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న చర్చి కాపరి డీఎస్ పాల్

## అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం



అక్కమాంబ ఆలయంలో పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం: తనది కష్టపడి పనిచేసే మనస్తత్వమని, పార్టీ అధిష్టానం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం మేరకే పనిచేస్తానని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కళ్యాణదుర్గంలోని పలు ఆలయాల్లో పూజలు జరిపించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తన స్వగ్రామం బ్రహ్మసముద్రం మండలంలోని నాగిరెడ్డిపల్లి అన్నారు. ఇక్కడే చదువుకున్నానన్నారు. కళ్యాణదుర్గం టికెట్ విషయంపై అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కొత్త సంవత్సరంలో ప్రజల కలలను సాకారం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

**ఆలయాల్లో పూజలు**

కళ్యాణదుర్గంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సోమవారం పర్యటించారు. మండలంలోని బోరంపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్థానిక నాయకులు విప్‌ను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అలాగే విప్ అక్కమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ప్రభుత్వ విప్‌ను ఆలయ పూజారులు, వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా కోటవీధిలో వెలసిన బావి బసప్ప శంకరాలయంలో విప్ ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వివిధ మండలాల నుండి వచ్చిన జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, స్థానిక నాయకులు విప్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ తలారి రాజకుమార్, నాయకులు జైపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రామాంజనేయులు, బాబురెడ్డి, సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జెడ్పీటీసీలు బొమ్మన్న, గుద్దెళ్ల నాగరాజు, ప్రభావతమ్మ, రాయదుర్గం నాయకులు ధనుంజయ రెడ్డి, మహేష్, బీటీపీ గోవిందు, రాజేంద్రరెడ్డి, కేశవరెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి, ఉమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల అభ్యున్నతికి పాటుపడదాం



ఎంపీపీని సన్మానిస్తున్న కళామండలి సభ్యులు

ఉరవకొండ: మండలంలోని నాటక కళాకారుల అభ్యున్నతికి పాటుపడదామని ఎంపీపీ నరసింహులు సూచించారు. సోమవారం స్థానిక సరస్వతి నాటక కళామండలి కార్యాలయంలో కళాకారుల సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సన్మానసభలో ఎంపీపీ పాల్గొన్నారు. కళామండలి సభ్యులు ఎంపీపీని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం కళాకారుల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. నాటక రంగ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. కళాకారుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఎంపీపీ గతంలో వందలాది నాటక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారని గుర్తుచేశారు. అనంతరం జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, జర్నలిస్టు ఓబులేసు, సీనియర్ కళాకారులు లాలెప్పను దుశ్శాలువాలు, పూలమాలలతో కళాకారుల సంఘం సభ్యులు సన్మానించారు. కళాకారుల సంఘం నాయకులు తండా లక్ష్మన్న, వెలిగొండ ఓంకారి గౌడ్, సిద్దప్ప, మారుతి పాల్గొన్నారు.

## ఘనంగా ఇమాంషావలి షంషీర్ ఊరేగింపు



షంషీర్‌ను ఊరేగింపుగా దర్గాకు తీసుకొస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని మాల్యంలో ప్రఖ్యాతి గాంచిన హజరత్ ఇమాంషావలి ఉరుసుకు భక్తులు పోటెత్తారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకూ ఉరుసు ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సోమవారం వేకువజామున హజరత్ ఇమాంషావలీ ప్రతిరూపమైన షంషీర్‌ను డ్రమ్ములు, మేళతాళాయి నడుమ భక్తిశ్రద్ధలతో గ్రామంలో ఊరేగించి ఉదయం 7.30 గంటలకు దర్గావద్దకు తెచ్చారు. భక్తులు షంషీర్‌ను దర్శించుకుని పునీతులయ్యారు. సోమవారం ఉదయం జియారత్‌తో ఉరుసు వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా దర్గాలో అన్నదానం నిర్వహించారు. నిర్వహకులు యూనుస్‌బాష, మాబుపీరా, గంగలాపురం ఫక్రుద్దీన్, మైకొసెట్ ఆదం, ఖలీల్ పాల్గొన్నారు.

## రేపటి నుంచి పింఛన్ పెంపు ఉత్సవం

గుమ్మఘట్ట: ప్రభుత్వం నూతనంగా పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. రూ.2,750 నుంచి రూ.3000లకు పెంచిన పింఛన్ మొత్తాన్ని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పంపిణీ చేస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యుడు, వార్డు మెంబర్లు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

రాయదుర్గం రూరల్: మండలంలో బుధవారం నుంచి పింఛన్ పెంపు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య సోమవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ప్ర జాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

బెళుగుప్ప: మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం పింఛన్ కానుకల పెంపు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 సచివాలయ పరిధిలో 5,813 మంది పింఛన్‌దారులు ఉండగా.. ప్రస్తుతం 131 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఈ నెల నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పింఛన్‌దారులకు రూ.3,000 చొప్పున పంపిణీ చేస్తామన్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించే కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

## వైభవంగా అయోధ్య అక్షింతల ఊరేగింపు



కూడేరు: రాముని చిత్రపటం, అక్షింతలు అందజేస్తున్న దృశ్యం



బెళుగుప్ప: భజన చేస్తూ గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కూడేరు: అయోధ్య రాముని చిత్ర పటం, అక్షింతలను సోమవారం కూడేరులోని కోదండరామ ఆలయ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. గత నెల 25న అయోధ రామునికి సంబంధించిన అక్షింతలను అయోధ్య తీర్థ ట్రస్టు సభ్యుడు సుదర్శన్ ఆధ్వర్యంలో మండలానికి తీసుకువచ్చారు. వాటిని రామాలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు అక్షింతలను మండలంలోని అన్ని గ్రామాలకూ అందజేశారు. వాటిని ఇంటింటా పంపిణీ చేస్తున్నారు. అయోధ్య రామలయ అక్షింతలను ఇళ్లలో పెట్టుకోవడం ద్వారా శుభప్రదంగా ఉంటుందని.. అంతా మంచి జరుగుతుందని అయోధ్య కమిటీ సభ్యుడు పురుషోత్తం, భక్తులు తెలిపారు.

బెళుగుప్ప: అయోధ్య నుంచి మండలంలోని గ్రామాలకు చేరిన అక్షింతల కలశాలకు పూజలు, భజనలతో శ్రీరామ భక్త భజన బృందాలు గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం మండలంలోని నక్కలపల్లికి చేరిన అయోధ్య అక్షింతలను మండలంలోని అన్ని గ్రామాలకు రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు పంపిణీ చేశారు. బెళుగుప్ప శ్రీరామ భక్త బృందం సభ్యులు నక్కలపల్లి నుంచి బెళుగుప్పలోని రామాలయానికి అక్షింతలను తీసుకువచ్చారు. మంగళవారం నుంచి ప్రతి ఇంటికీ అక్షింతలను పంపిణీ చేస్తామని భక్త బృందం సభ్యులు తెలిపారు.

### నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

రాయదుర్గం రూరల్: మండలంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య సోమవారం తెలిపారు. మంగళవారం మెచ్చిరి గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సర్పంచ్ ఊలెమ్మ అధ్యక్షతన ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

కూడేరు: మండలంలోని గొటుకూరులో మంగళవారం రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. వైద్య నిపుణులచే వైద్య సేవలు అందజేస్తామన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### నేటి నుంచి గ్రామసభలు

రాయదుర్గం రూరల్: మండలంలోని 19 గ్రామ పంచాయితీల్లో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం 15 పంచాయితీల్లో, 3వ తేదీ నాలుగు పంచాయతీలు, 4వ తేదీ ఒక గ్రామ పంచాయితీలో గ్రామసభలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

### ఏపీటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: ఏపీటీఎఫ్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను సోమవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏపీటీఎఫ్ నాయకులు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపిన అనంతరం క్యాలెండర్‌లు, డైరీల ఆవిష్కరణ చేపట్టారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అసోసియేట్ ప్రధాన కార్యదర్శి హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే బాస్కర్, ఏపీటీఎఫ్ జిల్లా మాజీ నాయకుడు సింగాడి తిప్పయ్య, నారాయణస్వామి, పాండురంగ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

### దళితులపై దాడులు ఆపండి

కళ్యాణదుర్గం రూరల్: దళితులపై దాడులు ఆపాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా ఇన్‌చార్జ్ చెలిమప్ప కోరారు. బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లిలో ఆదివారం దళితులపై దాడి చేసిన సంఘటనను ఆయన ఖండించారు. కన్నేపల్లిలో దళిత రామాంజనేయు, ఆంజనేయులు కుటుంబాలపై ఆదే గ్రామంలోని బీసీ కులానికి చెందిన గురుస్వామి, ఆయన కుటుంబ సభ్యులు దాడి చేశారన్నారు. ఈ సంఘటనలో గంగప్ప అనే దళితుడు గాయపడ్డాడన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయ్యాలన్నారు. కార్యక్రమలో దళిత నాయకులు పాల్గొన్నారు.